ఏ గొడవా లేకుండా ఆ పెళ్లి సాఫీగా జరగడానికి కారణం?

# తరం అంతరం

బెహారా వెంకట సుబ్బారావు కథ

నేను కళ్యాణ మండపం చేరుకునేసరికి ఉదయం తొమ్మిది గంటలైంది. వివాహం రాత్రి ఏడున్నరకి. మగపెళ్లివారు ఉదయమే వచ్చారు. స్నాతకం ఉత్సవం జరిపే హడావిడిలో వున్నారు. హాలులో రెండు నోటీసు బోర్డులు కన్పించాయ్. రైళ్లూ ఆర్టీసి బస్సుల రాకపోకల సమయాలు. బాగానేవుంది. పెళ్లి చూసుకుని వెళ్లేవారికి సౌకర్యంగా వుంటుంది అనుకున్నా. కానీ రెండవ బోర్డు చూశాక నాకదోలా అనిపించింది. ఆ బోర్డుమీద కాఫీ ఫలహారాలు ఉదయం 7 గంటలనుంచి తొమ్మిది గంటలవరకూ, మధ్యాహ్న భోజనం పన్నెండు గంటలనుంచి రెండుగంటలవరకూ, సాయంత్రం ఫలహారం నాలుగు గంటలకు — నాలుగున్నర గంటలకూ, రాత్రి భోజనం రాత్రి తొమ్మిదినుండి పదిన్నరవరకూ అని రాసివుంది. చేతికున్న వాచీ చూసుకున్నా తొమ్మిది గంటల ఐదు నిమిషాలైంది. అంతలో మైకులో అనౌన్స్‌మెంట్ వినిపించింది. "టిఫిన్ సెక్షన్ పూర్తికావస్తోంది. ఇంతవరకూ టిఫిన్ చేయనివారు దయచేసి పది నిమిషాల్లో కౌంటర్‌వద్దకు వచ్చి తీసుకొవ ప్రార్థన".

"అంటే ఆ టైము దాటాక వెళ్తే పెట్టరా?" అనుకున్నా మనసులో. వెనుకనుంచి కన్యాదాత మూర్తి వచ్చి పలకరించాడు. మూర్తి మా మేనల్లుడు. "ఎంతసేపయింది వచ్చి? ఒక్కడివే వచ్చావా?" కుటుంబంతో రాలేకపోయినందుకు నాకున్న ఇబ్బంది చెప్పాను.

"టిఫిన్ తీసుకుందువుగాని రా!" అంటూ మెయిన్‌హాలుకి పక్కనే వున్నవరండా



లోకి తీసుకెళ్లాడు. వరండాలో ఓ మూలగా టేబులుమీద పళ్లేలూ కాఫీ డ్రమ్ము వున్నాయి. ఒకతను నిలబడి అందరికీ అందిస్తున్నాడు. పది పదిహేనుమంది హడావిడిగా వెళ్లి ఓ ప్లేటులో పూరీ, కాఫీ రెండు చేతుల్తోనూ తెచ్చుకుంటున్నారు. వరండాలో వున్న టేబిల్స్‌మీద పెట్టుకుని తింటున్నారు. ఒకబ్బాయి మంచినీళ్లు సర్వ్ చేస్తున్నాడు. ఇద్దర

మూ ఆ టిఫిన్ కౌంటర్‌వైపు నడిచాం. గబగబా అడుగులువేస్తూ మూర్తి నాకన్నా ముందు ఆ కౌంటర్ చేరుకున్నాడు. ఒక ఖాళీ ప్లేటు తీసుకుని చేయి చాచాడు. పళ్లెంలోంచి రెండుపూరీలు కొంత కూరా వేసి అందించాడు ఆ కౌంటర్ బాయ్. తర్వాత ఖాళీ అయిన పూరీల పళ్లేన్ని కిందపడేశాడు. పెద్దగా శబ్దం అయింది. నాకిచ్చిన పూరీతో టిఫిన్ ఆఖరు అని అర్థం అయింది. మూర్తి అందించిన పూరీ తింటూ అడిగా. ''ఏవిటి? కాంట్రాక్టు ఇచ్చావా?'' అని. ''అవును మావయ్యా! ఇంట్లో చేసేవారు లేరు. వంటబ్రాహ్మణ్ణి పెట్టి వండించడానికి ముఖ్యంగా మాన్ పవర్ లేదు! అంతా కూర్చుని తినేవాళ్లేగాని కష్టపడేవాళ్లులేరు!'' అంటూ మూర్తి చెప్పబోతుంటే వాడి పెద్దబ్బాయి రామం వచ్చాడు కంగారుగా. ''నాన్నగారూ స్నాతకం అవుతోందిట నిన్ను రమ్మంటున్నారు!'' వర్తమానం అందించాడు రామం. రామం ఏమాత్రమూ గాభరా పడలేదు. ''ఓ కాఫీ తెచ్చి తాతగారికియ్యి'' పురమాయించాడు కొడుక్కి. ''టిఫిన్ సెక్షన్ క్లోజ్‌డ్'' అని రాసివున్న కాగితాన్ని గోడమీద అంటించాడు కౌంటర్ బాయ్.

అయితే ఇహ వచ్చేవాళ్లకి కాఫీ టిఫెన్లు లేవా?'' అడిగా మూర్తిని. వివరంగా చెప్పాడు మూర్తి.

''అమ్మాయి పెళ్ళికి కట్నమూ ఖర్చులూ కలిపి నా బడ్జెట్ అరవై వేలు. కానీ పెళ్ళికొడుకు తండ్రి డబ్బు మనిషిలా వున్నాడు. అన్నీ కలిపి యాభైవేలు కావాలని పట్టుబట్టాడు. పెళ్ళికి రెండు పూటలు పప్పూ అన్నం పెడితే చాలునన్నాడు''

''అన్నీ కలిపి అంటే?'' మధ్యలో వివరణ అడిగా.

''కట్నమూ, పెళ్లికొడుక్కీ, పెళ్లివారికీ ఆయా సందర్భాల్లో ఇవ్వాల్సిన బట్టలూ వగైరాలూ, ఇతర లాంఛనాలూ అన్నీ కలుపుకుని అన్నమాట. డబ్బిచ్చేశాం కనుక ఇహ మనం వాళ్లకీ ఏమీ పెట్టక్కర్లేదూ, ఇవ్వనవసరంలేదు. మన శక్త్యానుసారం, భోజనం పెట్టడమే అన్నమాట'' చెప్పాడు.

''అంటే అప్పగింతల బట్టలూ వగైరాలు కూడా లేవా?''

''ఆ ఏవీ లేవు... వాళ్లకక్కరలేదుట! పాలల్లో చేయి రాసి అప్పగించడమే! ఏం చేయమంటావ్! సంవత్సరంనుంచి తిరుగుతున్నా! సంబంధాలు చూసి చూసీ వారి కోరికలు విని విని విసిగి వేసారిపోయాను. అబ్బాయి వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. వాళ్లకు ఆస్తిపాస్తులు ఏవీ లేవు. అయినా దండిగా కట్నం కావాలి! ఆఖరికి ఈ సంబంధం కుదుర్చుకున్నా! ఫలహారాలు, భోజనాలు, పెళ్లికుమార్తెకీయవలసిన సారీ వగైరాలు అన్నింటికీ కాంట్రాక్టు ఇచ్చేశా. విస్తరికి ఇరవై రూపాయలు ఛార్జీ. పెళ్లివారు యాభైకి మించి రాము అని చెప్పారు. కానీ ఇప్పటికి డెబ్బయి మంది దాకా వచ్చారు. రాత్రికి మరో యాభైమంది రావచ్చు. ఆడపెళ్లివారితో కలిపి మూడువందలుంటారని కాంట్రాక్టరుకి చెప్పా. నేను అనుకున్నదానికంటే మరో పదిహేను వేలు ఎక్కువ ఖర్చయేలా వుంది'' వివరంగా చెప్పాడు. అంతలో మరొక పిలుపు రావడంతో ''మళ్లీ కలుస్తాను మామయ్యా!''

అంటూ వెళ్లాడు మూర్తి.

రామం కాఫీ తెచ్చి అందించి నా పక్కనే కుర్చీలో కూర్చున్నాడు.

"కాశీయాత్ర అవుతోంది కాబోలు! పెద్ద బావమరిదిని వెళ్లు!" అన్నా. దానికి రామం స్పందన వేరేగా వుంది. "బ్రహ్మచర్యం విరమించండి. నా చెల్లెల్నిచ్చి వివాహం చేస్తాం అని వేడుకోవడమే కదండీ! ఆ ఒప్పందం ఇదివరకే అయిపోయిందికదా! అయినా బట్టలు దొరుకుతాయన్న ఆశకూడా లేదు! అయినా ఆ ఘట్టం ఒట్టి దండగ" అంటూ కొట్టిపారేశాడు.

"అయినా ఆ వేడుక చూడాలికదయ్యా" అంటూ లేచాను. నాతోకూడా అతనూ లేచాడు. మేం వెళ్లేసరికి ఆ వేడుక అయిపోయింది. రెండో బావమరిది పెళ్లికొడుకుని బతిమాలి వెనక్కి తీసుకొస్తున్నాడు.

పూర్వం పెళ్లిళ్ల ఏడు రోజులూ — మూడురోజులూ జరిగేవట! అనుకోవడమే గానీ నేను చూడలేదు. అప్పుడు ఈ వరకట్నాలు లేకపోవడంవల్లనేమో! అన్ని రోజులూ మగపెళ్లివారిని ఆదరించి సపర్యలుచేసి మర్యాదలు చేసేవారట! మృష్టాన్న భోజనాలు ఘనమైన ఫలహారాలు ఏర్పాటుచేసేవారుట. వారికి ఎక్కడ ఆగ్రహం వస్తుందోనని హడలి చచ్చేవారట. వారి కనుసన్నలలో మెలిగేవారట. ఇహ అప్పగింతల సమయంలో పందిట్లో వున్న వారంతా కంటతడిపెట్టుకునేవారట. మగ పెళ్లివారి కుటుంబ సభ్యులందరికీ, వారి సమీప బంధువులకీ అమ్మాయిని అప్పగించేవారట! అప్పుడు అన్నీ సమిష్టి కుటుంబాలే! అందరికీ అప్పగించాలి. ఏ ఒక్కరిని మరిచిపోయినా వారికి ఆగ్రహం వస్తుందని ముందుగా ఎవరెవరికి అప్పగించాలో ఓ లిస్టు రాసుకునేవారుట! అత్తమామలు — బావలూ తోడికోడళ్లూ — ఆడపడుచులూ — వారి భర్తలు — పెళ్లికాని మరుదులూ, ఆడబడుచులూ, ఇంకా పినమామగార్లూ, పిన్నత్తగార్లూ — పెదమామగార్లూ — పెద్దత్తగార్లూ —

## వరస

"ఇదిగో రాణీ... నీ వరసేం బాగోలేదు... ఆ పక్కింటబ్బాయి శ్రీధర్ రోజూ మీ ఇంటిచుట్టూ తిరగడం నాకేం నచ్చలేదు" అంది ఆండాళు.

"ఆ సంగతి ముందే చెబితే... నేనే వాళ్లింటి చుట్టూ తిరిగేదాన్నికదా!" చెప్పింది రాణి.

— ధనశ్రీ (పీపల్‌పహాడ్)



వారందరికీ బట్టలూ! అంతమందినీ ప్రస న్నులుగావాలి మరి! ఏ ఒక్కరైనా తమ కూతుర్ని అభిమానించి ఆదుకోకపోతారా అన్న ఆశ కన్యాదాతలకుండేది.

"ఇప్పుడు సమిష్టి కుటుంబాలెక్కడు న్నాయ్ తాతగారూ! పెళ్లయిన వెంటనే మొగుడూ పెళ్లాలు వేరే పట్టణం కాపురం పెట్టడమేకదా! ఎవరి కాపురం వాళ్లది! ఆడపడుచుల్ని వాళ్ల భర్తలనీ, బావగార్లనీ, తోడికోడళ్లనీ ప్రసన్నులుగావించుకోవాల్సిన అవసరం ఏముందండి?" అన్నది ఇప్పటి యువతరం వాదన. ఆ వాదన అంగీకార యోగ్యమేనా?

ముఖ్యంగా పెళ్లిళ్లలో కాంట్రాక్టు ఇచ్చే పద్ధతికి నేను వ్యతిరేకిని. మన వాకిట్లోనే వంటలు వగైరాలు చేయించి స్వయంగా ఆడపెళ్లివారే మగపెళ్లివారికి వడ్డిస్తుంటే అదో రకం తృప్తి — ఆనందం. వరసలు కలుపుకుని సరస సంభాషణలతో, ఛలోక్తుల తో వడ్డిస్తుంటే అటు తినేవారికీ, వడ్డించేవా రికీ ఆనందంగా, తృప్తిగా వుంటుంది. మనుష్య సహాయం లేదని ఎవరైనా అంటే నేనంగీకరించను. పెళ్లిలో ఓ అరడజను యువకులు వడ్డనకు దొరక్కపోరు! ఎలాగూ వారడిగినంత కట్నం 'పారేస్తున్నాం'కదా అన్న నిర్లక్ష్యంతో వారే అడ్డుపడుతారన్న ధీమాతో ఆ విషయం బయటకు అవకుండా మేన్‌పవర్ లేదనిన్నూ ఇంకా ఏమో సాకులు చెప్పి తప్పించుకుంటారు చాలామంది. బట్ట లు నలగకుండా వుంటాయని ఈ హోటలు భోజనాలు ఏర్పాటు చేస్తారు. వడ్డన సమయ ంలో ఆదరింపులకి పోరు. ఆ విషయమే చూచాయగా అన్నానుమూర్తితో.

"కాంట్రాక్టరు మంచివాడేనా? ఆ మ ధ్య ఓ పెళ్లిలో వంటలూ వడ్డనలూ బాగులేవని గొడవపడ్డారు"

"మంచివాడేనట. మా ఆఫీసు ఫ్యూన్ మేనమామే ఈ కాంట్రాక్టు తీసుకున్నాడు. బాగానే వండుతాడు" చెప్పాడు మూర్తి.

పన్నెండు గంటలైంది.

మధ్యాహ్న భోజనం వడ్డన జరుగుతోంది . దయచేసి అంతా హాలులోకి రా ప్రార్థన" మైకులో అనౌన్స్‌మెంట్. ఆడ పెళ్లివారూ మగపెళ్లివారూ అంతా భోజనాల హాల్లోకి వెళ్లారు. టేబుల్స్‌ముందు కూర్చున్నారు. నేను భోజనానికి కూర్చోలేదు. ఆడపెళ్లివారి మనిషినికదా! హాల్లో పక్కగా నిల్చున్నా. వడ్డన జరుగుతోంది. హాల్లో ఆరు వరుసలు. వరుసకి ఇరవై నాలుగుమంది. ముందుగా వెజిటబుల్ పులావ్, ఉల్లిపాయ చట్నీ వడ్డన జరిగింది. ఆ తర్వాత బంగాళాదుంపల కుర్మా (చౌకగా లభించే) కాబేజీకూరా, వంకాయకూరా. టమోటా పచ్చడి. చాలా కొద్దికొద్దిగా వడ్డించారు. ఓ టేబుల్ మ్మ్రాను దు పప్పు. అన్నం వడ్డన అసలుజరగనే లేదు. అరాత పులావ్‌కి తలపడ్డారు. వాలాంటి వయసుమళ్లిన భోజనప్రియులు మాత్రం అసంతృప్తిగా అటూ ఇటూ చూసి అయిష్టం గానే పులావ్‌లో చేతులు పెట్టడం కన్పించిం ది. ఆ తర్వాత ఓ అబ్బాయి ఒక్కొక్క మైసూర్‌పాక్ ముక్కా జిలేబీ వడ్డించుకుపో తున్నాడు.

"తాతగారూ మీరూ కూర్చోలేదేం?" రామం వచ్చి అడిగాడు.

"తర్వాత బేచ్‌లో మనం అందరమూ తిందాం! మీ నాన్న కనబడ్డేం? అడిగా.

"ఈ పక్క హాల్లో నాన్నగారి ఆఫీస్ స్టాఫ్‌కి వడ్డన జరుగుతోంది. అక్కడ వున్నారు!" అవి చెప్పి రండి బయట నిలబడదాం!" అన్నాడు.

"ఇక్కడ ఆడపెళ్లివారి పెద్దవాళ్లు ఎవరైనా వుంటే బాగుంటుందేమో! వాళ్లు మొహమాట పడొచ్చు!" అన్నా.

"మనం ఎదురుగా లేకపోతేనే నిర్మొహమాటంగా అడిగి వేయించుకుని తింటారు తాతయ్యగారూ!" హోటల్లో భోజనం చేసేటప్పుడు మనం మొహమాట పడ్తామా చెప్పండి. మీరు పాత తరం మనుషులండి! ఆచార వ్యవహారాల్లో మీకూ మాకూ చాలా తేడావుంది. ఇప్పుడు డబ్బు వెనుకనే మనిషి నడుస్తున్నాడు" నా చాదస్తానికి చికాకుపడ్డా పైకి ప్రదర్శించలేదు రామం.

పెళ్లివారి భోజనాలువేగంగానే అయిపోయాయ్. చేతులు కడుక్కునేందుకు అంతా ఒక్కసారే బయటకువచ్చారు. వాళ్ల కామెంట్లు వింటూ నిలబడ్డాను.

సాంబారు తీసుకురావయ్యా అంటే మరి కనబడ్డవే మానేశాడు"

"మరో స్వీటు వేయండి అంటే తెస్తానంటూనే కాలక్షేపం చేశాడు!"

"ఈ కాంట్రాక్టర్‌కి డబ్బు వెనకేసుకోవడం బాగా తెల్సు!"

"ఇంతకీ అది పెరుగా? మజ్జిగా?"

"రామం నేనూ ఒకరిమొహాలొకరం చూసుకున్నాం. ఇలాంటివి మనం పట్టించుకోకూడదు తాతయ్యా! మాకు పప్పు అన్నం పెట్టి పంపించండి చాలు అన్నాడాయన. మనం ఎక్కువగానే చేశాం! రండి అటు వెళ్దాం!" అంటూ లాక్కుపోయాడు రామం.

రాత్రి పెళ్లి ఓ గంటన్నరలో అయిపోయింది. వివాహసమయం ఉభయవర్గాలవారూ దేనినీ పెద్దగా పట్టించుకోలేదు. అంతా యాంత్రికంగా జరిగిపోయింది.

కాంట్రాక్టరు సమయపాలన మెచ్చుకోక తప్పదు. రాత్రి తొమ్మిది గంటలకల్లా భోజనాలు వడ్డిస్తున్నట్లు ప్రకటించారు. భోజనం పట్ల దాదాపు అందరూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

"భోజనం కోసం వచ్చావేమిటయ్యా! పెళ్లికొచ్చాం! చూశాం! 'రాత్రి పదకొండు గంటలకి తిరుపతిపోయే ఎక్స్‌ప్రెస్ వుంది. పోదాం పదండి" అన్నాడు నాలాంటి వయసుమళ్లిన వ్యక్తి. నాకూ అలాగే అనిపించింది.

